క్లుప్తంగా

ఉన్నత లక్ష్యాలను సాధించాలి


నోట్‌పుస్తకాలు, దుప్పట్లు అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. పట్టణంలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులకు బుధవారం నోట్‌పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ సంక్షేమ అధికారి బి.రాములు, కౌన్సిలర్లు రఘు, నర్సింహారావు పాల్గొన్నారు.

వైరా ఎస్సైగా మేడా ప్రసాద్


ఎస్సై ప్రసాద్

వైరా: వైరా పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా మేడా ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్సైగా పని చేసిన వీరప్రసాద్ ఖమ్మం టూ టౌన్‌కు బదిలీపై వెళ్లారు.

ఆలయానికి ‘దూప దీప నైవేద్య’పథకం


రాష్ట్ర మంత్రి అజయ్‌ను సత్కరిస్తున్న కొణిజర్ల శివాలయం కమిటీ సభ్యులు

కొణిజర్ల: మండలంలోని కొణిజర్లలోని శ్రీమాన్ మహాదేవాలయం (శివాలయం) దూప దీప నైవేద్య పథకానికి ఎంపికయ్యింది. దీనికి సహకరించిన ఆలయ కమిటీ సభ్యులు ఖమ్మం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలిసి శాలువ, పూలమొక్కలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్‌కు ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రమేష్, ఆలయ కమిటీ సభ్యులు రమేష్, రవికిషోర్, ఆలయ అర్చకుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్‌కు నివాళి


జయశంకర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆచార్య జయశంకర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు సాంబశివరావు, ఎంపీపీ శిరీష నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, అప్పారావు, మస్తాన్ వలి, పుల్లారెడ్డి ఉన్నారు.

రాజీనామా..


రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న అప్పారావు

సత్తుపల్లి: బీజేపీ రాష్ట్ర కిసాన్‌మోర్చా అధికార ప్రతినిధి ఉడతనేని అప్పారావు ఆ పార్టీ సభ్యత్వానికి రాజీమానా చేస్తున్నట్లు ప్రకటించారు. సత్తుపల్లి పట్టణంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో ఉన్న బీజేపీతో ఈ ప్రాంత ప్రజలకు ఏమి చేయలేకపోడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ కృష్ణారావు, ఈశ్వర్, నాగేష్, మోహన్‌రావు, కరుణాకర్, రామకృష్ణ, వీరాస్వామి, శ్రీను, లక్ష్మారెడ్డి, మురళీ పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ

తల్లాడ: అన్నదానం మహాదానం అని తల్లాడ తహసీల్దార్ గంటా శ్రీలత అన్నారు. తల్లాడలో బుధవారం అంబేడ్కర్‌హాల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ దామోదరప్రసాద్ అన్నదానానికి రూ.10,000 ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, ఈఓ ఉమా, జీవీఆర్, మోదుగు ఆశీర్వాదం, కాంపల్లి రాము, బోనాసి శ్రీనివాసరావు, తేళ్లూరి చిన్న ఏసు, వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, కోడూరి వీరకృష్ణ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

సమాజంలో మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలంటే యోగాతోనే సాధ్యమని పలువురు వ్యక్తులు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీలలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. అనంతరం యోగా గురువులు దాని ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ యోగా తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లిరూరల్: గంగారం బెటాలియన్‌లో యోగాసనాలు వేస్తున్న కమాండెంట్ జమీల్‌బాషా, అధికారులు


మధిర: యోగా చేస్తున్న న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి


సత్తుపల్లిటౌన్: ర్యాలీ నిర్వహిస్తున్న యోగా, ధార్మిక సంస్థల సభ్యులు


చింతకాని: కొదుమూరు ఉన్నత పాఠశాలలో..


కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..


తల్లాడ: యోగా వేడుకలో పాల్గొన్న ఎంపీపీ, ఎంపీడీఓ తదితరులు


ఏన్కూరులో..


ముదిగొండ: పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థినులు


కొణిజర్లలో యోగా చేస్తున్న బాలికలు


ఎర్రుపాలెం: గురుకుల పాఠశాలలో..


బోనకల్: గోవిందాపురం (ఎల్) పాఠశాలలో..


కారేపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయంలో..

మాయమాటలు నమ్మొద్దు..

సత్తుపల్లి: పాదయాత్రల పేరిట వస్తున్న పార్టీ నాయకుల మాయమాటలు నమ్మొద్దని, వారితో జాగ్రత్తగా ఉండాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. పట్టణంలోని వేంసూరురోడ్‌లోని 40 డబుల్‌బెడ్‌రూం ఇళ్లను గురువారం కల్లూరు ఆర్డీఓ సూర్యనారాయణతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధిలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ప్రజలు సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలన్నారు. గతంలో అధి కారంలో ఉన్న పార్టీలు ఏనాడైనా షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు అమలు చేశారా అని ప్రశ్నించారు. సీఎం కుర్చీకోసం తప్పా.. రాష్ట్రాభివృద్ధికి పాటుపడింది ఏమి లేదన్నారు. అనంతరం లబ్ధిదారులతో సామూహిక గృహప్రవేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేష్, మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉమామహేశ్వరరావు, ఆత్మకమిటీ చైర్మన్ వాసు, పట్టణ అధ్యక్షుడు రఫీ, కౌన్సిలర్లు మౌలాలీ, చాంద్ పాషా, నాగుల్‌మీరా, గఫార్‌ఖాన్, మధు, విజయనిర్మల, ప్రకాశరావు, అబ్దుల్లా పాల్గొన్నారు.

కేన్సర్ బాధితుడికి ఎమ్మెల్యే చేయూత..


బాధిత కుటుంబానికి రూ.10 వేల నగదు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కల్లూరు: కల్లూరు పట్టణానికి చెందిన ఎస్‌కే రజాబ్ కుమార్తె షమీమ్ కేన్సర్ వ్యాధితో బాధపడుతుండగా ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య రూ.10 వేలు అందించారు. ఈ నగదును ఎంపీపీ రఘు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్‌ల చేతుల మీదగా షమీమ్‌కు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్కినేని రఘు, సయ్యద్ అలీ, పసుమర్తి చందర్‌రావు, లక్ష్మణరావు, ఇస్మాయిల్, కమ్లి, కృష్ణ, వెంకటరత్నం, రామకృష్ణ, ప్రసాద్, రవూఫ్, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు వినతి..

తల్లాడ: మున్నూరు కాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బుధవారం తల్లాడ తహసీల్దార్ గంటా శ్రీలతకు వినతిపత్రం అందించారు. వీరికి కార్పొరేషన్‌తో పాటుగా ప్రతి ఏటా రూ.5 వేలకోట్లు కేటాయించాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు విద్యార్థులకు హాస్టల్ భవనాల నిర్మాణానికి ఎకరం స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, సీహెచ్ క్రిష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, మధు, మాధవరావు, నరసింహారావు, వేలాద్రి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గోరక్ష చట్టాన్ని కఠినతరం చేయాలని..

కారేపల్లి: గోరక్ష చట్టాన్ని కఠినతరం చేయాలని కోరుతూ.. విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో సింగరేణి తహసీల్దార్ తూమటి శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం కారేపల్లి పోలీస్‌స్టేషన్, సింగరేణి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేసి, గోవులను వధించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు గోరక్ష వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ధర్మప్రచారక్ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిజాయతీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

సత్తుపల్లిటౌన్: ప్రయాణికులు పోగొట్టుకున్న రూ.25వేల నగదును తిరిగి అప్పగించి సత్తుపల్లి ఆర్టీసీ డిపో కండక్టర్ నిజాయతీ చాటుకున్నారు. అశ్వారావుపేట మండలం గాండ్లగూడెంకు చెందిన బాలజీ అశ్వారావుపేట నుంచి సత్తుపల్లి వస్తున్న ఆర్టీసీ బస్సుఎక్కాడు. వెంటనే ఎక్స్‌ప్రెస్ రావటంతో బస్సు దిగి ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు. ఈక్రమంలో తన పర్సుపోవడంతో అశ్వారావుపేట కంట్రోలర్ సునీతకు సమాచారం అందిచడంతో ఆమె బస్సు కండెక్టర్ టీవీ రావుకు తెలపడంతో సీటును పరిశీలించి పర్సును సేకరించారు. సత్తుపల్లి బస్టాండ్ డిపోలో సెక్యూరిటీ హెడ్‌కానిస్టేబుల్ రవి, టీఐ–3 రామ్‌కుమార్, ఏడీసీ జీవీ సమక్షంలో రూ.25వేలు నగదు ఉన్న పర్సును బాలజీకి అందించారు.

ఎమ్మెల్యే రాములునాయక్ జన్మదిన వేడుకలు

వైరా/వైరారూరల్/కొణిజర్ల/ఏన్కూరు/కారేపల్లి: వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల ఆధ్వార్యన బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైరాలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేతో కలిసి ఏసీపీ రెహమాన్ కేక్ కట్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు నాయకులు పాల్గొన్నారు. అలాగే, ఏన్కూరులో తలసేమియా బాధిత చిన్నారుల కోసం బానోతు సురేష్‌నాయక్, శెట్టిపల్లి వెంకటేశ్వరావు, భూక్యా లాలు తదితరుల ఆధ్వర్యాన రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. కొణిజర్లలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వై.చిరంజీవి, వై.శ్రీనివాసరావు ఆధ్వర్యాన పీహెచ్‌సీలో కేక్ కట్ చేసి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కారేపల్లిలో ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పెద్దబోయిన ఉమాశంకర్ ఆధ్వర్యాన పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ చేశారు. వైరా మండలం గొల్లపూడి వృద్ధాశ్రమంలో సర్పంచ్ పసుపులేటి వినోద వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

అంబేడ్కర్ నగర్‌లో విద్యుత్ లోక్ అదాలత్

తల్లాడ: మండలంలోని అంబేడ్కర్ నగర్ గ్రామంలో బుధవారం విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లాడ విద్యుత్ శాఖ ఏడీఈ ఖాదర్‌బాబు మాట్లాడుతూ.. విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం ఎస్సీలకు వంద యూనిట్లు లోపు విద్యుత్ వాడుకున్న వారికి సబ్సిడీ వర్తింప జేస్తుందన్నారు. అర్హులైన లబ్ధిదారులు తమ కుల సర్టిఫికెట్లను విద్యుత్ శాఖా కార్యాలయంలో అప్పగించాలన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ జేఏఓ భాను, ఏఈ రాజేష్, శ్రీనివాసచారి, శ్రీనివాసరావు, సతీష్ పాల్గొన్నారు.

యువతి మృతికి సంతాపం

కొణిజర్ల: మండలంలోని రామనర్సయ్యనగర్‌లో సంపంగి సునీత జ్వరంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైరా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు బానోత్ బాలాజీ నాయక్, గ్రామ వార్డు సభ్యులు శ్రీనివాసరావు, మల్లయ్య, ఏడు కొండలు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. 15 రోజుల వ్యవధిలోనే ఆ కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు మృత్యువాతన పడటం గ్రామంలో విషాదాన్ని నింపింది.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

తల్లాడ: మండలంలోని బస్వాపురం గ్రామంలో బుధవారం విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వజ్రాల హరిబాబుకు చెందిన పాడి గేదె పొలంలో మేతకు వెళ్తుండగా.. కిందపడిన త్రిఫేజ్ కరెంట్‌వైరు తగిలి షాక్‌తో చనిపోయింది. దీని విలువ రూ.80వేలు ఉంటుంది. ఈ విషయమై బాధితుడు తల్లాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వ్యర్థాలు తిన్న ఆవు..

మండలంలోని రెడ్డిగూడెం సమీపాన డంపింగ్ యార్డ్‌లో వేసిన వ్యర్థాలు తిన్న ఓ ఆవు బుధవారం మృతి చెందింది. రెడ్డిగూడెంకు చెందిన రాజబోయిన సైదులుకు చెందిన ఆవు మేత కోసం వెళ్లగా డంపింగ్ యార్డ్‌లో పేపర్లు, కవర్లు తినగా పొట్ట ఉబ్బి చనిపోయింది. రూ.50వేల విలువైన ఆవును కోల్పోయిన తనకు న్యాయం చేయాలని రైతు కోరాడు.

గ్రంథాలయానికి స్థలం వితరణ

కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండి గ్రామంలో గ్రంథాలయ నిర్మాణానికి వేము గంగరాజు తాతయ్య, నాయనమ్మ జ్ఞాపకార్థంగా రెండు కుంటల స్థలాన్ని వితరణగా అందించారు. దీంతో గ్రామస్తులు ఆయన కుటుంబానికి అభినందనలు తెలిపారు.

ఘనంగా ఆధ్యాత్మిక దినోత్సవం


వైరా: కోదండరామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్


సత్తుపల్లి: మసీద్‌లో జరిగిన ప్రార్థనలకు హాజరైన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, తదితరులు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ‘ఆధ్యాత్మిక దినోత్సవం’సందర్భంగా సత్తుపల్లి, మధిర, వైరా నియోజక వర్గాల్లోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. జామ మసీదుల్లో దువ్వాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషితో ప్రార్థనా మందిరాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సర్వ మతాలకు ప్రాధాన్యత నిస్తుందన్నారు. ఈ కార్యక్రమాలల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, అర్చకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్


తల్లాడ: చర్చిలో.. బీఆర్‌ఎస్ నాయకులు


ఏన్కూరు: సుదర్శనయాగం చేస్తున్న అర్చకులు

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

కల్లూరు రూరల్/ఎర్రుపాలెం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి వస్తుందని మాజీ మంత్రి,పీసీసీ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్, ఆపార్టీ మండల కమిటీ ఉపాధ్యక్షులు నర్సింహారావు, శ్రీనివాసరెడ్డిలు తెలిపారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా కల్లూరు మండల చిన్న కోరుకొండిలో, ఎర్రుపాలెం మండలంలోని భీమవరం గ్రామంలో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అధోగతి పాలైందన్నారు. ఈ కార్యక్రమాలల్లో మండల అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, పీసీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, కిరణ్ కుమార్, అప్పారావు, సాల్మన్‌రాజు, వెంకటేశ్వర్లు, రామారావు, నర్సింహారావు, రాజశేఖర్, జనార్దన్, పుల్లారావు, భాస్కర్‌రావు, సమిత్, శ్రీనివాసరెడ్డి, బోస్, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, జానీబాషా, ఆదాం, ప్రసాద్, వెంకయ్య, సంజీవరెడ్డి, రాజేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి సంభాని

తపాలా సేవలను వినియోగించుకోవాలి

వైరా: కేవలం రూ.399కే తపాలా శాఖ ద్వారా ప్రమాద బీమా సౌకర్యాన్ని కలిపిస్తున్నట్లు తపాలా శాఖ మధిర సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ బాజీ బాబు అన్నారు. వైరా పోస్టాఫీస్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ బీమా తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత రవాణా ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు, హాస్పిటల్‌లో చికిత్స పొందితే రోజుకు రూ.1,000 చొప్పున తపాలా శాఖ చెల్లిస్తుందన్నారు. మహిళలకు లబ్ధి చేకూరే విధంగా మహిళా సమ్మాన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. దీని ద్వారా అధిక వడ్డీలు పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైరా ఎస్‌పీఎం ప్రసన్న, ఎంఓఎస్ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ బాజీ బాబు

లైబ్రరీ ఏర్పాటు చేస్తాం


పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కారేపల్లి: కారేపల్లి క్రాస్‌రోడ్డులో మూతపడిన పాఠశాలలో లైబ్రరీ ఏర్పాటు చేస్తామని సింగరేణి ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆ పాఠశాల భవనాన్ని పరిశీలించి మాట్లాడుతూ.. మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో మూతపడిన పాఠశాలకు ప్రహరీ నిర్మాణంతో పాటు, మరమ్మతులు చేపట్టి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీంతో పాటుగా మాణిక్యారం, చీమలపాడు గ్రామాల్లో కూడా గ్రంథాలయాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ విషయమై ఐటీడీఏ పీఓకు ప్రతిపాధనలు పంపామన్నారు. కార్యక్రమంలో ముత్యాల సత్యనారాయణ, షేక్ మీరా, కృష్ణమూర్తి, పురం నారాయణ, శ్రీనివాసరావు, పెద్ద వెంకన్న, వెంకటరామయ్య, రవీందర్‌రెడ్డి, సైదులు, మదార్, నాగాచారి, గ్రామ కార్యదర్శి రాకేష్, ఉపాధ్యాయుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల హెచ్‌ఎంలకు సన్మానం

సత్తుపల్లిరూరల్/సత్తుపల్లిటౌన్: పది ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ హైస్కూల్ హెచ్‌ఎం సరోజిని, కిష్టారం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం బాలకృష్ణలను మంగళవారం రాత్రి ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సత్కరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయా గ్రామాల్లోని గ్రామస్తులు, సర్పంచ్‌లు వారికి అభినందనలు తెలిపి సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమాలల్లో సర్పంచ్ రేణుకఈశ్వర్, అప్పారావు, ఉపసర్పంచ్ ధనంజయ్‌రావు, చెరుకుపల్లి ఎంపీటీసీ కృష్ణారావు, ఈశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ‘గృహలక్ష్మి’ అందించాలి

ముదిగొండ: మండలంలో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పొలడుగు భాస్కర్ తెలిపారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి తహసీల్ వరకు ప్రదర్శనగా వెళ్లి ధర్నా నిర్వహించారు. మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమాలను మరచిన పాలక ప్రభుత్వాలకు పతనం తప్పదన్నారు. అనంతరం తహసీల్దార్ శిరీషకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వరరావు, పద్మ, వైస్ ఎంపీపీ దామోదర్, ఉపేందర్‌రావు, భద్రయ్య, నాగేశ్వరరావు, రాజు, వెంకయ్య, సతీష్, ప్రభావతి, పుల్లయ్య పాల్గొన్నారు.

గోల్డ్‌మెడల్ విజేతకు సన్మానం


మంగతాయారును సన్మానిస్తున్న దృశ్యం

ఏన్కూరు: భగవత్‌గీత పోటీలలో గోల్డ్‌మెడల్ సాధించిన పసుమర్తి మంగతాయారుకు ఐకేపీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం హరినారాయణ, అంగన్‌వాడీ టీచర్స్ సుశీల, అరుణ, జ్యోతి, ఆర్య వైశ్య మహిళలు వాణి, కవిత, సుధ, మౌనిక, ప్రేమనందం పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో దివ్యాంగులకు ప్రయోజనం

చింతకాని: ఫిజియోథెరపీతో చలన సంబంధిత దివ్యాంగులకు ప్రయోజనం చేకూరుతుందని ఫిజియోథెరపిస్టు వల్లూరి వసంత అన్నారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో 18 సంవత్సరాల వయస్సు కల్గిన దివ్యాంగులను బుధవారం వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రాంబాబు, ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షురాలు అరికొట్ల లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.


ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు వసంత